ఎండమావులు

బి.యస్.ఆర్. కృష్ణరావు

"ఆత్మ సౌందర్యంగల ఆడది బాహ్య సౌందర్యాన్ని ఆరాధించే భర్తను ఆకర్షించుకోటంలో ఆలస్యం చేస్తుందేమో" అన్న తండ్రి మాటలు ఇంకా ప్రతిధ్వనిస్తూనే వున్నాయి వెంకట్రావుకి. ప్రతి మానవుడికీ మేధాశక్తీ, అభిలాష, ఆలోచనలు భిన్నంగా వుండడంచేత, దృష్టికి ఏవస్తువైనా మానవు లందరకూ ఒకే రీతిగా కనబడినప్పటికీ, దానిని తమ మనస్సులో చిత్రించుకోటంలో తమతమ బుద్ధులనుబట్టీ, అభిమానాలనుబట్టీ వారివారి అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. ఒకరికంటికి నదరుగా కనబడ్డ వస్తువు మరొకరిదృష్టికీ అట్లాగే కనిపించినప్పటికీ, మనస్సుకిమాత్రం ఆ వస్తువులో ఏదో లోప మున్నట్లుగా తట్టటంచేత, అది కంటికి కూడా ఇంపుగా కనిపించదు.

వెంకట్రావు వాల్తేరు స్టేషనులో దిగాడు. ఇదివరకెప్పుడూ వాల్తేరు విశాఖపట్టణాలు చూడలేదతను. ఇల్లు బయల్దేరి వచ్చేసింతరువాత స్టేషనులో అప్పుడు ఏబండివుంటే ఆబండి ఎక్కి అది ఎంతవరకుపోతే అంతవరకు పోదామనుకున్నాడు. ఆ రైలు వాల్తేరువరకు పోతుందన్నారు. అక్కడివరకూ ఒక టిక్కట్టు కొనుక్కుని రైలెక్కాడు. వెడుతున్నా డన్నమాటేగాని సరిగ్గా ఎక్కడికి వెళ్ళాలో, ఏం చెయ్యాలో అతనికి తోచలేదు. ఇంట్లోనుంచి బయల్దేరేముందు ఎంత ఆలోచించినా ఒక నిర్ణయానికి రాకపోయేసరికి స్టేషనుకు వెళ్ళింతరువాత ఆలోచించవచ్చులే అనుకున్నాడు. రైలెక్కి వాల్తేరులో దిగాడు. రైలంతా ఖాళీ అయింది. ఆడవాళ్లూ మగవాళ్లూ ఉత్సాహంగా కొందరూ, నిరుత్సాహంగా కొందరూ దిగారు. ఇంతమంది ఎక్కడ్నుంచి వచ్చారు, ఎక్కడికి పోతున్నారు? అంతా నిజంగా ఈ వూళ్లో పనుండే వచ్చారా, పనుంటే ఏంపనుండి వచ్చారు? ఆడవాళ్ళుకూడా ఒంటరిగా రైలుదిగి వస్తున్నారే, వీళ్ళ కేంపని ఇక్కడ? అని ఆలోచిస్తూ నిల్చున్నాడు ప్లాట్‌ఫారంమీద. జనమంతా వెళ్లిపోయారు. మళ్ళీ ఈ తిరుగుబండిలో వెళ్లేవాళ్లు ఆత్రంగా చోటు దొరుకుతుందో దొరకదో అనే కంగారుతో పడుతూ లేస్తూ, ఒకరినొకరు నెట్టుకుంటూ రైలెక్కి అమ్మయ్యా అని నిట్టూర్పు విడుస్తూ కూర్చుంటున్నారు. వీళ్ళంతా ఈవూళ్ళో తాము వచ్చిన పనులు పూర్తయి వెళ్ళిపోతున్నారు కాబోలు. మళ్ళీ వీళ్ళంతా ఏఏవూళ్ళు వెళతారో, వెళ్ళి అక్కడ ఏం చేస్తారో? ఇంతమంది వెళ్ళి వచ్చేవాళ్ళలో తన మాదిరిగా వచ్చినవాళ్లు ఒకళ్లూ కనిపించరు. ఈ అనంత ప్రజానీకంలో అనవసరంగా నిర్ణీతకార్యక్రమం లేకుండా వచ్చినవాళ్ళు ఒక్కళ్లూ కనబడరు. ఈ వచ్చి వెళ్లేవాళ్లెవరిలోనూ నిజంగా తనమాదిరిగా వచ్చినవాళ్ళెవరయినా వుంటే, ఏం చెయ్యాలో తోచక తనమాదిరి ప్లాట్‌ఫారంమీద నిలబడి దిక్కులు చూసేవాళ్లే కదా. కాబట్టి ఇట్లా ఎవరూ వచ్చినవాళ్లు లేరేమో అనుకున్నాడు వెంకట్రావు. బండి టైమైంది. నిండుచూలాలు పుట్టింటికి వెళుతున్న మాదిరిగా మెల్లిగా బయల్దేరి పోతున్నది రైలు. క్రమేపీ ప్లాట్‌ఫారం దాటిపోయింది. ఇంక ప్లాట్‌ఫారం మీద లైసెన్సుకూలీలు, రైల్వేపనివారూ తప్ప ఎవరూ లేరు. ఎంత టైమైవుంటుందో నని గడియారంవైపు చూశాడు. తను నిల్చుని దాదాపు గంటసేపయినట్లుగా తెలుసుకున్నాడు. రైలు వచ్చింది,

వెళ్ళిపోయింది. వాస్తవంగా జీవంలేనిది కాబట్టి మానవుడు కల్పించిన తాత్కాలికపు జీవశక్తి, కదలిక కలది కాబట్టి వస్తుతః ప్రాణాధారం లేకపోయినా రైలు తనపని తాను నిర్వర్తించుకుంది. కాని ప్రాణం వున్న తనుమాత్రం నిర్జీవ ప్రతిమలా, పరిపరివిధాలుగా పోతున్న మనస్సు అరికట్టే శక్తి లేకపోవటంచేత, ఏం చెయ్యటానికీ తోచక అట్లాగే నిల్చున్నాడు.

"బాబూ, బజార్ పోదామా" అన్నాడు రిక్షావాడు.

"బజారు దేనికి? ఏమన్నా చూడవలసిన వింత లున్నాయా" అన్నాడు- అవి చూస్తూ వున్నా కాసేపు మానసికవ్యథ తగ్గుతుందేమోనని.

"ఇంతలు కాదు బాబయ్యా, మీకేటయినా పన్లున్నయేమోనని" అన్నాడు రిక్షావాడు. "సరే, పోనియ్య" అని బయటికొచ్చి రిక్షా ఎక్కాడు. రిక్షావాడు పోతున్నాడు.

"అబ్బ,ఇంతమంది రైల్లో ఈవూరొచ్చారు కదా. వీళ్ళంతా నిజంగా పనుండే వస్తారంటావా?" అన్నాడు.

"బాగా అడిగారు బాబయ్యా. పన్లు లేకపోతే ఈ కరూకాలంలో రైల్ చార్జి పెట్టుకుని ఊరికనే వత్తారా బాబయ్యాం, అల్లకి ఏటేటో పన్లుంటంనుంచే వత్తూంటారు. మీ రేంపనుండొచ్చారు బాబయ్యా!" అన్నాడు.

ఈమాటకు ఏం చెప్పటానికీ తోచలేదు వెంకట్రావుకి. వాడు అడిగిందానికి సమాధానం చెప్పకపోతే ఏమనుకుంటాడో అని—

"అయితే ఆ మొగని దిగి నుంచోండి, బాబయ్యా. కాలేజీపోయే బస్సు అక్కడే నిండుతుంది" అని రిక్షా దించాడు. వాస్తవంగా కాలేజీ కాకపోయినా ఒక నిర్ణీతమైన పని లేదు కనక, అక్కడే దిగి రిక్షావాడికి డబ్బిచ్చి పంపేసి నిల్చున్నాడు. మరో పదినిమిషాల్లో బస్సు వచ్చింది. బస్సెక్కి కూర్చున్నాడు.

అనేకమంది విద్యార్థులూ, విద్యార్థినులూ రకరకాలుగా అలంకరించుకుని ఆ బస్సులోనే కాలేజీకి పోతున్నారు. వీళ్ళంతా ఎంత చక్కగా వున్నారు- ప్రతినిత్యమూ శ్రమకోర్చి ఈ బస్సులో కాలేజీకి వెళ్ళి చదువుకుంటున్నారు కదా. ఇంతమంది జనంలోనూ భగవంతుడు వీళ్ల సందర్నీ ఎట్లా పుట్టించాడోకాని ఒకళ్ళ పోలిక ఒకళ్ళకి వుండదు- ఎక్కడో తప్ప. పొడుగు ముక్కువాళ్లూ పొట్టిముక్కువాళ్లూ, కోలముఖం వాళ్లూ గుండ్రముఖం వాళ్లూ, పొట్టివాళ్లూ పొడుగువాళ్లూ, ఎర్రటివాళ్లూ నల్లటివాళ్లూ— రకరకాలయిన వేషాలు సంతరించుకొని పోతుంటే చూట్టానికి ఎంతో ముచ్చటగా వుంది. మానవ జీవితాధ్యాయంలో అత్యంతానందమయ జీవిత ఘట్టం కాలేజీ జీవితమే. ఏ చీకూ చింతా లేకుండా వేళకల్లా భోంచేసి, పుస్తకాలు తీసుకుని ఎంచక్కా కాలేజీకి పోతున్నారు. ఈనున్నటి తారు రోడ్డుమీద, ఎగుడుదిగుడుగా వున్నా, బస్సులో కుదుపు లేకుండా పక్కనున్న కొండలనూ, బంగాళాలనూ, చెట్లనూ, ఫలవృక్షాలనూ చూసుకుంటూ, సముద్రపుగాలిని పీల్చుకుంటూ స్వర్గధామంలో తేలిపోతున్నట్లుగా కాలేజీకి పోయి చదువుకుంటున్నారు. ఎంత అదృష్టవంతులు! కొత్తకోడలి సిగ్గు దొంతర్లలాగ, మామిడిచెట్టు పూత ఎంత అందంగా వుంది. క్రమంగా సిగ్గు దొంతర్లూ ముసిముసినవ్వులూ విడిపోయి, సంసారంలో గల సుఖదుఃఖాలూ, అత్తగారిపట్టి వాదిగిళ్లూ, ఆడుబిడ్డల ఈసడింపు మాటలూ చవిచూస్తూ బిడ్డల్ని కని పెంచుతున్న రీతిగా, చిగురాకు తొగరులో లేతాకు మృదుత్వంలో ముచ్చటగా గుత్తులు గుత్తులుగా పూతపూసి ఎంతో అందంగా వుండి క్రమంగా పిందెలై కాయలై పశువుల కాపర్లు రాళ్లువేసి కొడుతున్నా, పిల్లలు చెట్టెక్కి కోస్తున్నా, తోటమాలి వలవేసి లాగుతున్నా ఓర్చుకుంటూ చైతన్యాన్నంతా కోల్పోయి తనలో శక్తి వున్నంత వరకూ కాయలు కాసి చివరకు ఆకు రాలి నిర్జీవంగా మోడులా అయిపోతుంది మామిడిచెట్టు. చెట్టుపూత దగ్గర్నుంచీ ఆకురాలుడు కాలం వరకూ గల పరిణామదశల నన్నిటినీ పరికిస్తూ, నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వంకరటింకరగా పెద్ద త్రాచుపాములా వున్న ఆ నల్లతారురోడ్డుమీద వీటినన్నింటినీ చూసుకుంటూ ఆనందిస్తూ కాలేజీకి పోవటం ఎంత అదృష్టం అనుకున్నాడు వెంకట్రావు.

కాలేజీ వచ్చింది. జడివానలో అంతా ఒక్కసారిగా దిగి అచ్చాఫీసులోని అక్షరాల

కూర్చుబల్ల గదుల్లోకి ఏ అక్షరానికా అక్షరం వెళ్ళినట్లుగా ఎవరి క్లాసులోకి వాళ్లు వెళ్ళిపోయారు. మళ్ళీ తనొక్కడే మిగిలాడు. అప్పటికి దాదాపు రెండున్నరయింది. మళ్లీ మనస్సు తన యథార్థ పరిస్థితిలోకి వచ్చేసరికి తనింకా భోజనం చెయ్యలేదనే విషయం గుర్తొచ్చింది. ఈ వేళప్పుడు భోజన మెక్కడా వుండదు. ఒక వేళ వున్నా అసహ్యంగా వుంటుంది. అయినాగాని ఇంకా స్నానం చెయ్యలేదు. పోనీ ఇంత టిఫినయినా తిని కాఫీ తాగి పొట్ట నింపుకుందామనుకున్నాడు. పక్కనున్న హోటల్లో కూర్చుని సముద్రపు హోరులో, చల్లగాలిలో, అలలను తిలకిస్తూ సుష్టుగా టిఫిను తిని, కాఫీ త్రాగాడు. రూపాయిన్నర బిల్లు సర్వరు బల్లమీదే పెట్టాడు. బిల్లు చెల్లించి మళ్ళీ ఎక్కడికి వెళ్ళాలనే సందిగ్ధావస్థలో పడి తోచక కాసేపు సముద్రాన్ని చూస్తూ కూర్చుందామనుకుని సముద్రపుఒడ్డున ఒక బండరాతిమీద కూర్చున్నాడు చూస్తూ. ఆ సముద్రపుగాలి అతని శరీరానికి తాకి మధ్య మధ్య వుక్కిరిబిక్కిరవుతూవుండేవాడు. బ్రహ్మాండమైన అలలు నురుగులు కక్కుకుంటూ ఒడ్డు చివర వరకూ వచ్చి చెల్లాచెదరై పోతున్నాయి. అతని మనస్సులో కూడా ఆలోచనా పరంపరలు వెల్లువలె వచ్చి ఒకనిశ్చయానికి రాలేక యథామథలై పోయేవి. కొన్నిచోట్ల సముద్రతరంగాలు నురగలు కక్కుతూ వచ్చి పక్కనున్న బండరాళ్లను ఎదుర్కొని బ్రహ్మాండమైన శబ్దాన్ని చేస్తూ వికావికలై మళ్ళీ సముద్రంలో కలసిపోయేవి. తమకున్న శక్తినంతా వినియోగించి అలలు ఒక్కసారిగా బండరాళ్ళను ఢీకొంటున్నా, వాటిని రాపాడినా లేశమైనా కదిలించలేక పోతున్నాయి. అంతరాత్మ ప్రబోధించే సదభిప్రాయపు సలహాలను, కఠినాతికఠినమైన అతని మనోగతాభిప్రాయాన్ని మార్చలేక పోతున్నాయి. సముద్రపుహోరు అతని అంతరాంతర కల్లోలానికి తగినట్లుగా లయవేస్తున్నది. అట్లా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే తెలియదు. ఒక తడవ అటువైపు చూశాడు. కాలేజీ వదిలినట్లున్నారు. మళ్ళీ విద్యార్థులూ విద్యార్థినులూ అంతా బస్సెక్కి, నడిచీ, సైకిళ్ళ మీదా వెళ్ళిపోతున్నారు ఎవరిళ్ళకు వాళ్లు. హాస్టల్లో వుండే వాళ్లు మాత్రం కాలేజీ చుట్టుపట్లనే చల్లగాలికి

తిరుగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు కులాసాగా. ప్రతీ ముఖంలోనూ ఆనందమూ, ఉత్సాహమూ వెల్లివిరిసి పోతున్నాయి. అక్కడున్న ప్రతి వ్యక్తీ ఏదో పనిమీద వుంటున్నట్లుగా భావించసాగారు కాని, కాలం వ్యర్థపుచ్చుతున్నామని ఏ ఒకరూ అనుకోవటం లేదు. విద్యార్థుల అలజడి అణిగిపోయింది. దూరాన్నుంచి ఒక యువకుడూ, యువతీ వస్తున్నట్లుగా కనుపించారు. వాళ్ళవైపు అతని దృష్టిపడింది. తనను చూడనట్లుగానే పక్కనుంచి వెళ్ళిపోయారు కొండచాటుకు. వాళ్ళ కబుర్లూ వాళ్ళ ఉత్సాహమూ చూస్తే ప్రపంచంతో తమకేమీ సంబంధం లేనట్లుగానే భావించుకోసాగారు. ఆనందడోలికల్లో, ఆ స్మితామృత తరంగాలలో తేలిపోతున్నట్లుగా భావిస్తున్నారు. కాలేజీ జీవితాల్లో ప్రణయాలకూ, కలయికలకూ తావున్నదన్నమాట. లేకపోతే ఇంత చోటుండగా, ఇన్ని భవనాలుండగా ఆ కొండచాటుకు ఎందుకు పోతారు? పనిపాటలూ, నిర్ణీత కార్యక్రమమూ లేని తనమాదిరిగా వారిద్దరూ కూడా సంచరించే స్థితి ఎందుకు కలుగుతుంది. చదువుసంధ్యల పేరుతో ఇటువంటి సంఘటనలు కూడా జరుగుతున్నా యన్నమాట. ఆ అమ్మాయి ఏమంత అందంగా వున్నదని వెంటబెట్టుకుని వచ్చాడు. ఆ కళ్ళజోడూ, మొహాన బొట్టు లేకుండా, చేతులకూ కాళ్ళకూ మెళ్ళోకీ ఏమీ లేకుండా, ఎత్తుమడమల బూట్లు వేసుకుని గువ్వలా వుండి, కొంగలా మెడబెట్టి - ఏమిటి ఎగరేసుకుంటూ? ఎంత అసహ్యంగా వుంది. అటువంటి గేడికొంగ అతనికి అపరూపసౌందర్యవతిలా కనిపించిందన్నమాట ఇంతమంది కాలేజీ విద్యార్థినుల్లో. ఆ పిల్లను తీసుకుని ఈ ఎగుడు దిగుడు కొండలూ గుట్టలూ ఎక్కుతూ దిగుతూ, ఏం ఖర్మం పట్టింది అతనికి? తనకేం ఖర్మం, ఇంటి దగ్గరవాళ్లందర్నీ వదిలిపెట్టి వేళకు శుచిగా రుచిగా చేసి సుష్ఠుగా భోజనం పెట్టే అమ్మను వదిలిపెట్టి, అడిగినప్పుడల్లా కాస్తో కూస్తో డబ్బిచ్చే నాన్నని వదిలిపెట్టి చిలుకపలుకుల్లా వచ్చీరాని మాటలతో తను ఇంటికి రాగానే ఎదురొచ్చే చిట్టి చెల్లెల్ని వదిలిపెట్టి, రాత్రంతా నిద్రలేకుండా ఈ విశాఖపట్టణం వచ్చి అన్నపానాదులూ స్నానసంధ్యలూ లేకుండా ఈ హోటళ్లలో రూపాయిన్నరా చెల్లించి యాతిప్పలు పడ్డం?

కొద్దిసేపయాక వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. అతని దగ్గరనుంచే వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. మానాభిమానాలు లేవు. ఈ కొండరాళ్ళను ఆశ్రయించవలసిన గతి పట్టింది.

ఇంకా బాగా సూర్యాస్తమానం కాలేదు. అప్పటికి సుమారు అయిదున్నరమాత్రమే అయింది కాలేజీ టవర్‌క్లాక్‌లో. వెంకట్రావు మళ్ళీ తనపరిస్థితులను గురించి ఆలోచించుకుంటున్నాడు. వెనకనుంచి పకపకమని 'నవ్వు వినపడింది. ఎవరో ఇద్దరు యువతీయువకులు కాలేజీ బాటనే వస్తున్నారు. ఆ అమ్మాయి నాజూకుగా ఎంత బాగుంది! పచ్చి పసుపుకొమ్ములా వుంది. సన్నగా, నాజూకుగా, కపటాకులా వుంది. ఆ కళ్ళు, ఒకవిధమైన అందం ఉట్టిపడుతూ, చిలిపితనంగా కొంటెగా మిలమిల లాడుతున్నాయి. ఒకవేళ దేవకన్యేమో అనుకున్నాడు వెంకట్రావు. వాళ్లిద్దరూ అతని పక్కగానే సుమారు ఓపంద గజాల దూరం వెళ్ళి అక్కడ సముద్రపొడ్డున ఇసుకలో కూర్చున్నారు చెట్టాపట్టాలు వేసుకుని. ఆ అమ్మాయి నవ్వుతూ ఏదో మాట్లాడుతున్నది. వెంకట్రావు చెవులునిక్కబొడుచుకుని విన్నాడు.

"ఇంత భయమయితే ఎట్లా రామరి. కులాన్ని, సంఘాన్ని ఎదిరించి మనిద్దరం ఎక్కడికయినా లేచిపోవాలి. ఇది తప్పదు - ఏమంటావ్?"

"నాకు ధైర్యం చాలటంలేదు లలితా. పెద్దల మాట ఎన్నడూ జవదాటి ఎరగను. కాలప్రభావం చేత మనిద్దరికీ పొత్తు కుదిరింది. ఇట్లా రహస్యంగానే కలుసుకుందాం గాని ధైర్యం చెయ్యలేను."

"ఇదేనా నీ ధైర్యమూ? నన్ను నమ్మించి అప్పుడు ఆవేశంగా కల్లబొల్లి కబుర్లు చెప్పావే. నీ మాటలు విని ఆనంగారావుని వదిలిపెట్టి నీచెంత చేరాను. సరే, ఆఖరుతడవ అడుగుతున్నా."

"క్షమించు, లలితా. అంతపని చెయ్యలేను."

"సరే, అయితే నాదారి నేను చూసుకోక తప్పదు. నే వెళుతున్నా, గుడ్‌బై" అని ముందు

కుంటూ వెళ్ళిపోయింది. అతనూ మరోదార్ని కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు.

అంత అందగత్తెను ఎవరుపడితేవాళ్ళు చక్కగా పెళ్ళిచేసుకుంటారు. తనకేకనక తటస్థపడితే పువ్వుల్లో పెట్టి పూజించేవాడు. కాని ఏం లాభం- బుద్ధి మంచిది కాదు. ఇదివరకు రంగారావుని ప్రేమించిందట. ఇప్పుడితన్ని, రేపు యింకొకరిని. ఎంత అందగత్తయితే ఏం, గుణం మంచిది కానప్పుడు. భగవంతుడు అంత అందగత్తెకు గుణాలుకూడా మంచివి ఆపాదిస్తే ఎంతో రాణించేది ఆ పిల్లకు శరీరసౌందర్యం వున్నది, కాని ఆత్మ సౌందర్యం లేదు. ఎంత ధైర్యంగా చెప్పింది ఆమాటలన్నీ. ఆ అనాకారిని వెంటవేసుకుని మాటాపలుకూ లేకుండా తిరిగాడు. ఆ మొదటివాడు. ఈ అందగత్తెతో వేగలేక విసిగి వేసారిపోయాడు ఆ రెండవవాడు. ఎంత తారతమ్యం! సముద్రంలో ఎక్కడో ఒక పెద్ద కెరటం బయల్దేరింది. నురుగులు కక్కుకుంటూ పొంగుతూ బ్రహ్మాండశబ్దంతో హోరుమంటూ రెండు నిలువుల ఎత్తున వచ్చి బండరాయిని ఢీకొన్నది. బండరాయిలో చలనం కలిగింది. ఇందాకటి అలేవీ వీసమెత్తయినా కదిలించలేక పోయాయి. ఈఅల కొద్దిపాటిమాత్రమయినాకదిలించకలిగింది.

వెంకట్రావు లేచాడు. కాలేజీ దగ్గిరకి వచ్చాడు. టవర్ క్లాక్‌లో ఆరుగంట లయింది. అక్కడున్న రిక్షావాడిని పిల్చి, స్టేషనుకు పదమన్నాడు. వచ్చేటప్పుడురోడ్డు ఎత్తుగావుంది. పోయేటప్పుడు చాలా పల్లం రిక్షావాడు గబగబా లాగేశాడు. స్టేషనులో అడుగుపెట్టి అమ్మయ్యా అన్నాడు. ఇంకా టికెట్లు ఇచ్చేందుకు అర గంట టైముంది. అరగంటసేపూ ముళ్ళమీద కూర్చున్నట్లే వుంది అతనికి. టైమైంది. ఆజనంలో తోసుకుంటూనే టిక్కెట్టు తీసుకుని బయట పడ్డాడు. మరో పావుగంటలో రైల్లో పడ్డాడు. అప్పటికి కొంచెం కుదుటబడింది మనస్సు. రైలు పోతున్నది. స్టేషన్లు ఒకటొకటే దాటిపోతున్నాయి. ఎన్ని దాటినా తన స్టేషను రావటం లేదు. మళ్ళీ ఏదో స్టేషనులో బండిఆగింది. ప్రయాణీకులతో పాటు ఒక బిచ్చగాడు ఎక్కాడు. మళ్లీ రైలు బయల్దేరింది. బిచ్చగాడు గొంతెత్తి పాడసాగాడు.

గుణములే సొగసనీ, ఎంత చెప్పిన గాని,
మది కెక్కలేదె వో చిన్న నా పికమా!
కుంకుమా తిలకమ్ము, మోము నిడినంతపై
అరుణకాంతీ వోలె అంద మిచ్చుచునుండె
తీగదేహమ్ములో, తియ్యనైన మాటలో
తలయెత్తి చూడగనె, తత్తరముపడినాను
తళుకుబెళుకులు జూచి, తత్తరము పడుచునే
కలు పోరగా వేసి తలయెత్తి చూశాను
మెరపు మరపించేటి, చిరునగవు సొగసులూ
చిన్నారిమగువకే అందమనుకున్నా!
గుణములే సొగసనీ ఎంతచెప్పిన గాని
మది కెక్కలేదె వో చిన్ననా పికమా!

బిచ్చగాడు అడుక్కుంటూ వచ్చాడు. పాట వింటున్నంతసేపూ తన్మయత్వం చెందాడు వెంకట్రావు. బిచ్చగాడి చేతులోకి పావలా పెట్టాడు. రైలుమధ్య దార్లో వున్నా మనస్సు ఇంటివద్దకు పరుగెత్తింది.

తనవూరి స్టేషను వచ్చింది. గబగబ రైలుదిగి జట్కా కట్టించుకుని ఇంటికి వెళ్ళాడు. అత్తాకోడళ్ళిద్దరూ విచారంగా కూర్చున్నారు వరండాలో. అతన్ని చూడగానే ముఖాలు విప్పారాయి ఇద్దరికీ. తల్లి కౌగిలించుకుని "ఈరెండు రోజులూ ఎక్కడికి వెళ్ళావురా నాయనా? కన్న కడుపు నాకన్నకూడా కమల ఎంత విచారించిందో, ఆ భగవంతుడికే తెలియాలి" అన్నది. ఈ మాటలు విని తండ్రికూడా బయటికొచ్చాడు. ఆయనకూడా సంతోషపడ్డాడు కొడుకు వచ్చినందుకు.

"నిజంగా నాకోసంవిచారించావా కమలా?" అన్నాడు ఆమెతల నిమురుతూ.

'చెబితే మట్టుకు నమ్ముతారా ఏమిటి" అన్నది చిన్నగా నవ్వుతూ.

"అబ్బ! నిజంగా మూర్ఖుడునే కమలా. యథార్థ దృశ్యాలు కొన్ని చూస్తేకాని, నిజానిజాలు తెలియవు" అన్నాడు ఆవేశంగా.

"నే నిదివరకే చెప్పానుగా-ఆత్మసౌందర్యం గల ఆడది బాహ్యసౌందర్యాన్ని ఆరాధించే భర్తను ఆకర్షించుకోటంలో ఆలస్యం చేస్తుందేమోనని" అన్నాడు తండ్రి, అర్థనిమీలిత నేత్రాలతో కొడుకూకోడళ్ళవైపు చూస్తూ.